# నమస్తే తెలంగాణ

# వరంగల్

5 | ఆదివారం 28 జూలై 2024 | WARANGAL


- జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో కుండపోత
- ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి
- పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు
- మత్తడి దుంకుతున్న చెరువులు, కుంటలు
- నీట మునిగిన పంట పొలాలు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు


టేకుమట్ల : నిండుగా ప్రవహిస్తున్న చలివాగు

# గెరువియ్యని వాన

## ఉమ్మడి జిల్లాలో రోజంతా ముసురు

నమస్తే నెట్‌వర్క్ : ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపిలేని వాన కురిసింది. శనివారం ఉదయం మొదలైన ముసురు రాత్రి వరకు కొనసాగింది. కాగా, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లోని పలు మండలాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతుండగా, పలు చెరువులు, కుంటలు మత్తడి దుంకుతున్నాయి. భారీ వరదకు పంట పొలాలు నీట మునిగాయి. పలుచోట్ల లోలెవల్ వంతెనలపై నుంచి వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే పలు చోట్ల రహదారులపై చెట్లు విరిగిపడ్డాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమై ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని గణపసముద్రం సరస్సు నీటిమట్టం 21 అడుగులకు, రామప్ప చెరువు 27 అడుగులకు చేరుకుంది. టేకుమట్ల మండలంలోని చలివాగు, మానేరు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో కురిసిన భారీ వర్షానికి జంపన్న వాగు పొంగి ప్రవహిస్తున్నది. గోవిందరావుపేట మండలం చల్వాయిలో మార్క సారమ్మకు చెందిన పెంకుటిల్లు కూలిపోగా, మరికొన్ని పాక్షికంగా దెబ్బతిన్నాయి. వెంకటాపురం(నూగూరు) మండలంలోని కంకల, పాత్రాపురం, జిన్నెల వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో భద్రాచలం వెళ్లే ప్రధాన రహదారిపైకి నీరు చేరి రాకపోకలు నిలిచిపోయాయి.



హనుమకొండలో వర్షంలో వెళ్తూ..


వెంకటాపురం (నూగూరు) : రోడ్డుపైకి చేరిన వరద నీరు


గణపురం : మత్తడి పోస్తున్న వంగపల్లిలోని వాణి చెరువు


వాజేడు : నాగారం గ్రామ శివారులో గుమ్మడిదొడ్డికి వెళ్లకుండా రోడ్డుకు అడ్డుగా పెట్టిన తాటి దుంగ

## గోదావరి ఉగ్రరూపం


మంగపేట : కమలాపురం ఇన్‌టేక్ వెల్ వద్ద గోదావరి ఉధృతి

కాళేశ్వరం/ఏటూరునాగారం/కన్నాయిగూడెం/మంగపేట/వాజేడు/వెంకటాపురం (నూగూరు) : జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల పరిధిలో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. కాళేశ్వరం వద్ద 7.50 లక్షల క్యూసెక్కుల వరద ఉండగా, కన్నాయిగూడెం, ఏటూరునాగారం, మంగపేట, వాజేడు, వెంకటాపురం (నూగూరు) మండలాల పరిధిలో ప్రమాదకర స్థాయిలో ప్రవహించింది. రామన్నగూడెం, రాంనగర్, ఏటూరునాగారం, రొయ్యూరు, ముల్లకట్ట పరిధిలోని వందల ఎకరాల పంట పొలాలు మునిగి పోయాయి. రామన్నగూడెం-ఏటూరునాగారం మధ్యలోని కరకట్ట క్రమంగా కొట్టుకుపోతూ ప్రమాదకరంగా మారండంతో నీటి పారుదలశాఖ అధికారులు ఇసుక బస్తాలు వేశారు. వాజేడు, గుమ్మడిదొడ్డి బ్రిడ్జి నీటమునగడంతో నాగారం గ్రామం వద్ద రోడ్డుకు అడ్డంగా అధికారులు తాటి దుంగను వేసి రాకపోకలు నిలిపివేశారు. అలాగే టేకులగూడెం రేగుమాగు బ్రిడ్జిపై 10 రోజులుగా వరద నీరు నిలిచి ఉండడంతో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు రాకపోకలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాగా, సాయంత్రం నుంచి గోదావరి వరద క్రమక్రమంగా తగ్గుతూ వస్తున్నది. గోదావరి పరీవాహక ప్రాంతాలను ఏటూరునాగారం ఏఎస్పీ శివమ్ ఉపాధ్యాయతో కలిసి ములుగు ఎస్పీ శబరీష్ సందర్శించి పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.


వాజేడు : కృష్ణాపురం వద్ద వరదను పరిశీలిస్తున్న ములుగు ఎస్పీ శబరీష్


ఏటూరునాగారం : దొడ్లవాగుపై ఒరిగిపోయిన ఐరన్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి

## ఒరిగిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఫ్రేం

ఏటూరునాగారం మండలంలోని దొడ్ల వాగుపై రూ. 25 లక్షలతో నిర్మాణం చేపట్టిన ఐరన్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఫ్రేం వరద తాకిడికి నీటిలో ఒరిగి పోగా, మధ్యలో వేసిన ఐరన్ పిల్లర్ కొట్టుకుపోయింది. గతేడాది వరదలకు బ్రిడ్జి కొట్టుకుపోయి కొండాయి, మల్యాల గ్రామాల ప్రజల రవాణా నిలిచిపోవడంతో వారి సౌకర్యార్థం ఈ బ్రిడ్జిని ఏర్పాటు చేస్తున్నారు. ఎలాంటి జాయింట్లు లేకుండా ఏకంగా మూడు వందల అడుగుల పొడవున తయారు చేసిన ఐరన్ ఫ్రేంను స్లాబుల పైనుంచి ఐరన్ పిల్లర్ మీదుగా అమర్చాల్సి ఉంది. బరువుతో పాటు పొడవుగా ఉండడంతో దానిని బిగిస్తుండగానే ఈ ఘటన చోటుచేసుకుంది.


మహాముత్తారం : లోలెవల్ కాజ్‌వేపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దవాగు






## వరదలోనూ విద్యుత్ సేవలు

వాజేడు, జూలై 27 : గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నా లెక్కచేయకుండా విద్యుత్ సిబ్బంది సేవలందిస్తున్నారు. వరద ప్రాంతంలో ఉన్న వాజేడు, గుమ్మడిదొడ్డి, చీకుపల్లి కరెంట్ పోల్స్ ఎక్కడైనా నీటి మునిగాయా అని శనివారం వెంకటాపురం ఏడీఈ స్వామిరెడ్డి, ఏఈ అర్షద్ అహ్మద్, జేఎల్‌ఎం రాజేందర్ ఇలా బోటులో వెళ్లి పరిశీలించారు. అలాగే ప్రగళ్లపల్లిలో రహదారిపై 11కేవీ లైన్‌పై విరిగిపడిన చెట్టును జేఎల్‌ఎం వంశీ, జీపీ సిబ్బంది వర్షంలోనూ తొలగించి ప్రజల మన్ననలు అందుకున్నారు.


వాజేడు : నిండు గోదావరిలో విద్యుత్ లైన్ల చెకింగ్ కోసం బోటులో వెళ్తున్న విద్యుత్‌శాఖ ఏడీ, ఏఈలు


భిక్షాటన చేస్తున్న ఉద్యమ కళాకారులు

# జోలెపట్టి.. భిక్షమెత్తి

- వరంగల్‌లో ఉద్యమ కళాకారుల నిరసన
- కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నదని ధ్వజం
- వెంటనే ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్

వరంగల్ చౌరస్తా, జూలై 27: ఎన్నికల సమయంలో మూడు నెలల్లో ఉద్యోగం కల్పిస్తామని ప్రకటించిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలైనా తమను పట్టించుకోవడం లేదని ఉద్యమ కళాకారులు వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ శనివారం వారు వరంగల్ నగరంలో భిక్షాటన చేశారు. సకల కళా సాంస్కృతిక మండలి, తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల ఐక్య వేదిక, వారసత్వ కళల సంరక్షణ సమితిల ఆధ్వర్యంలో వరంగల్ రైల్వేస్టేషన్ జంక్షన్ నుంచి ఎంజీఎం సర్కిల్ వరకూ రోడ్డుకు ఇరువైపులా కరపత్రాలు పంచుతూ.. పాటలు పాడుతూ జోలెపట్టి భిక్షమెత్తి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కళాకారుల సంఘాల నాయకులు మాట్లాడుతూ ఒడ్డెక్కే వరకు ఓడ మల్లన్న.. ఒడ్డెక్కినాక బోడ మల్లన్న అన్నట్లుంది కాంగ్రెస్ ప్రభుత్వం తీరని దుయ్యబట్టారు. ఇచ్చిన మాటకు కట్టుబడి అర్హులైన కళాకారులకు ఉద్యోగాలు కల్పించాలని, ఎస్సీ, బీసీ, మైనార్టీలకు అనుసరిస్తున్న విధంగా కళాకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు అందించాలని, వృద్ధాప్యంలో ఉన్న కళాకారులకు పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సకల కళాసాంస్కృతిక మండలి రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం సుధాకర్, తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు బిర్రు సురేందర్, వారసత్వ కళల సంరక్షణ సమితి అధ్యక్షుడు ఎస్‌కే.రాజు, ఉమ్మడి వరంగల్ జిల్లా పరధిలోని కళాకారులు పాల్గొన్నారు.


ఆపరేషన్ థియేటర్ స్లాబ్‌కు ఏర్పడిన లీకేజీ

# ఉరుస్తున్న భవనాలు.. తప్పని ఇబ్బందులు

**ములుగు దవాఖానలో రోగులు, జంగాలపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు తప్పని పాట్లు**

ములుగు రూరల్, జూలై 27 : వారం రోజులుగా కురుస్తున్న వానలకు ములుగు ప్రభుత్వ దవాఖానలో స్లాబ్‌లో లీకేజీలు ఏర్పడి అక్కడక్కడా ఉరుస్తుండడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. కాన్పుల విభాగం, ఐసీయూ, ఆపరేషన్ థియేటర్లతో పాటు బాలింతల వార్డుల్లో స్లాబ్ నుంచి నీరు కారుతున్నది. వరండాలో సైతం నీరు నిలిచింది. అలాగే ములుగు మండలం జంగాలపల్లి అంగన్‌వాడీ కేంద్రానికి పెయింటింగ్ వేసి అందంగా ముస్తాబు చేసిన అధికారులు పైకప్పును బాగుచేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. వంటగదిలోనూ అదే పరిస్థితి నెలకొంది. ప్రతి బుధవారం పశువుల సంత వ్యర్థాలను సెంటర్ పక్కనే పడేస్తున్నా పారిశుధ్య పనులు చేపట్టకపోడంతో చిన్నారులు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది.


ఉరుస్తున్న అంగన్‌వాడీ భవనంలోని వంట గది

## విద్యుత్ షాక్‌తో రైతు మృతి



రాజిరెడ్డి(ఫైల్)

చెన్నారావుపేట, జూలై 27: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని కోనాపురంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు తుమ్మలపెల్లి రాజిరెడ్డి(50) సరళ కుంట చెరువు సమీపంలోని తన పొలంలో ఇటీవల నాటు వేశాడు. పొలానికి నీరు పారించేందుకు శనివారం విద్యుత్ మోటర్‌ను ఆన్ చేయగా పనిచేయలేదు. కరెంట్ సరఫరా ఉందో లేదో తెలుసుకునేందుకు విద్యుత్ స్తంభానికి తగిలించిన తీగలను సరిచేస్తుండగా, అందులో ఒకటి ఊడి రాజిరెడ్డిపై పడింది. ఈ క్రమంలో విద్యుత్ షాక్ గురైన రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య పద్మ, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నర్సంపేట మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఏఎస్సై లక్ష్మణమూర్తి తెలిపారు.

# ఇక ధరలు చూసి కొనొచ్చు..

**లక్ష్మీపురం మార్కెట్‌లో డిజిటల్ డిస్‌ప్లే బోర్డు**

కాశీబుగ్గ, జూలై 27 : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు అనుసంధానంగా ఉన్న లక్ష్మీపురం మోడల్ కూరగాయల మార్కెట్‌లో శనివారం డిజిటల్ ధరల పట్టికను ఏర్పాటు చేశారు. కలెక్టర్ సత్యశారద ఆదేశాల మేరకు వినియోగదారుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని మార్కెట్ ప్రధాన ద్వారం వద్ద దీనిని ఏర్పాటు చేశారు. రోజూ మార్కెట్‌లో విక్రయించే హోల్‌సెల్, రిటైల్ ధరలను ఆ పట్టికపై ప్రదర్శించనున్నారు. ఇక నుంచి వినియోగదారులు డిస్‌ప్లేపై ధరలను చూసి కూరగాయలు కొనొచ్చని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల తెలిపారు.




డిజిటల్ ధరల పట్టిక

# పీడ విరగడైంది..!

- ఎంజీఎం దవాఖానలో వెలసిన ఫ్లెక్సీ
- సిబ్బంది సంబురాలపై భిన్నస్వరాలు

వరంగల్ చౌరస్తా, జూలై 27: సాధారణ బదిలీల్లో భాగంగా ఎంజీఎం దవాఖానలో పాలనాధికారి బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో ఎంజీఎం ఔట్ పేషెంట్ల విభాగానికి చేరుకునే ప్రధాన రెండో, మూడో నంబరు గేట్లకు శుక్రవారం అర్ధరాత్రి సమయంలో 'శాడిస్ట్ అయిన పాలనాధికారి ఎంజీఎం నుంచి బదిలీ అయినందుకు ఎంజీఎంకు పట్టిన పీడ విరగడైంది. హాస్పిటల్ సిబ్బంది ఆనందోత్సాహాలతో పండుగ జరుపుకుంటున్నాం' అంటూ సిబ్బంది పేరుతో రాయించిన ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు కట్టారు. ఈ మేరకు సిబ్బంది స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. శనివారం విషయం తెలుసుకున్న వైద్యాధికారులు శానిటేషన్ సిబ్బందితో బ్యానర్లను తొలగింపజేశారు. ఈ విషయమై ఎంజీఎంలో భిన్నస్వరాలు వినివస్తున్నాయి. అధికారి ఉద్యోగులను ఇంత ఇబ్బంది పెట్టారా అని కొందరు, నిబంధనలు పక్కాగా పాటిస్తే ఇలా చేస్తారా.. అని మరికొందరు పెదవి విరుస్తున్నారు.



ఎంజీఎం గేట్‌కు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ





























